క్లుప్తంగా

లెప్రసీ రోగులకు మందులు, బియ్యం పంపిణీ



లెప్రసీ రోగులకు పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ, డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు వర్ధంతి సందర్భంగా సోమవారం భీమవరం పరిసర ప్రాంతాల్లో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా బీవీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లోని లెప్రసీ సెంటర్లలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సెంట్‌మేరీస్ లెప్రసీ సెంటర్‌లో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు సుమారు రూ.50 వేల విలువ కలిగిన మందులు, బియ్యం అందజేశారు. 7వ వార్డులోని లెప్రసీ సెంటర్‌లో రోగులకు బియ్యం, పండ్లు, నెలవారీ పింఛన్లు అందించారు.

కాళ్లలో యోగాంధ్ర ర్యాలీ



యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కాళ్ల: కాళ్లలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.స్వాతి మాట్లాడుతూ యోగ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, ఏపీఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసాపురం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంలో అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరిస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఎందరో రైతులు భూములిచ్చారని, ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారు చౌకగా ధారాదత్తం చేయాలని చూడటం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎడ్ల చిట్టిబాబు, పున్నాని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్, పైల సత్తిబాబు, కిలారి రాజు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగించకుండా క్రమబద్ధీకరించాలి



ఆర్డీవో దాసి రాజుకు సమస్య వివరిస్తున్న సరిపల్లి వాసులు

నరసాపురం: 30 ఏళ్లగా పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తూ నివాసం ఉంటున్న తమ ఇళ్లను తొలగించకుండా క్రమబద్ధీకరించి పట్టాలు ఇప్పించాలని నరసాపురం మండలం సరిపల్లి గ్రామం ఏరువు ప్రాంత వాసులు కోరుతున్నారు. సోమవారం గమిడి మధుబాబు ఆధ్వర్యంలో నరసాపురం ఆర్డీవో దాసి రాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. బండి పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న తమ ఇళ్లను జీవో నంబర్ 30, 2025 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలన్నారు. కానీ ఇటీవల ఇళ్ల తొలగించాలని పంచాయతీ తీర్మానం చేసినట్టుగా తెలిసి ఆందోళన చెందుతున్నామని వాపోయారు. తాము నివసిస్తున్న బండి పోరంబోకు స్థలానికి అక్కడున్న ప్రభుత్వ చెరువుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఇళ్ల స్థలాలు కూడా తీసుకోలేదని వివరించారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న తమకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జల్లి శాంతకుమారి, జల్లి లక్ష్మీకాంతం, మోకా రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటిపై కూటమి కక్ష



తాళ్లకోడులోని జగనన్న కాలనీలో పునాదుల్లోనే ఇళ్ల నిర్మాణాలు



కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లు



నీళ్ల సరఫరా కోసం పైప్‌లైన్ల తిప్పలు

- జగనన్న కాలనీల్లో అభివృద్ధి శూన్యం
- కనీస వసతులు లేక కాలనీవాసుల ఇక్కట్లు

ఆకివీడు: పేదల ఇంటిపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. జగనన్న కాలనీల్లో ఏడాది కాలంగా ఎటువంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా కాలనీవాసులను ఇక్కట్లు పాల్జేస్తోంది. కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు కొందరు ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరి ఇళ్లు పునాది దశలోనే మిగిలిపోయాయి. వారికి ఎన్నికల హామీల్లో భాగంగా ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పట్టించుకోకపోగా ఇల్లు నిర్మించుకోకపోతే స్థలాలను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించడంతో దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారు.

కాలనీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఏ విధమైన మౌలిక వసతులు లేకపోవడంతో కాలనీల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో 1000కు పైగా నూతన గృహాలు నిర్మించుకుని గృహప్రవేశాలు చేశారు. మరో 1000 నిర్మాణ దశలో పూర్తి కానున్నాయి. మరో 500లకు పైగా ఇళ్ల నిర్మాణం పునాదుల దశలో ఉన్నాయి. మిగిలిన లబ్ధిదారులు 700 మందికి పైగా నిరుపేదల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ రోడ్లు, డ్రైయినేజీ, మంచినీటి సౌకర్యాలు లేకపోవడంతో కాలనీల్లో నివాసం ఉంటున్న వారు గగ్గోలు పెడుతున్నారు. ఎండాకాలంలో ఎడారి లాగా, వానాకాలంలో చిన్నపాటి దీవిలా కాలనీలు నీట మునిగి ఉంటున్నాయని ఆవేదన చెందుతున్నారు. డ్రైయినేజీ సౌకర్యం కల్పించాలని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని, పాడైన వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి నిరుపేదలకు రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది గడిచినా లబ్ధిదారుల వైపే చూడటంలేదని వాపోతున్నారు. ప్రభుత్వం నిధులు సమకూర్చితే తమకు సొంత ఇంటి కల నెరవేరుతుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణ నిధుల కోసం ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని వారు కోరుతున్నారు.

పేరు మార్పు తగదు



మూడు దశాబ్దాల పోరాటాల ఫలితంగా కుప్పనపూడి శివారు తాళ్లకోడులో 74 ఎకరాల భూమిని నిరుపేదల కోసం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో అప్పటి ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి టీడీపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లు కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పేదలకు ఇళ్ల స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలతో పాటు డ్వాక్రా రుణసదుపాయం కల్పించి ఇళ్ల నిర్మాణానికి సహకరించారు. అటువంటి జగనన్న పేరును కాలనీకి తొలగించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదు. – నంద్యాల సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

ఇళ్ల నిర్మాణానికి రుణం ఇవ్వాలి



ఎన్నికల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించి ఏడాది గడచినా కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్రం ఇచ్చే రుణ సహాయం కూడా అందజేయలేదు. పేదలు ఏవిధంగా ఇల్లు నిర్మించుకుంటారు. పేదల సొంత ఇంటి కల నెరవర్చేందుకు వైఎస్సార్ కుటుంబం ఎంతో కృషి చేసింది. అంటువంటి వ్యక్తి పేరును తొలగించడం అవివేకం. కాలనీల పేరులు మార్చడం ద్వారా ప్రజలకు లబ్ధిచేకూరదు. పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చాలి. జగనన్న పేరును కొనసాగించాలి.

అంబటి రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఆకివీడు

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కష్టాల్లో ఉన్న వారికి దాతలు అందించే సహకారం మరువలేనిదని మానవతా జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధితులకు, వారి పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా దాతల సహకారంతో హెచ్‌ఐవీ బాదితులకు ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. దాత డి.నాగమల్లేశ్వరరావు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ మండల అధ్యక్షుడు మద్దాల వాసు, ముత్యాల రామారావు, రావాడ సతీష్, బొక్కా రమాకాంత్, ముత్యాల చైతన్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిర్జీవంగా ఉండి సెంటర్!



నిర్మానుష్యంగా మారిన ఉండి సెంటర్



ఉండి సెంటర్‌లో మండుటెండలో ఓ దుకాణం నీడలో ప్రయాణికుల పాట్లు

ఉండి: ఎప్పుడు దుకాణాలు, ప్రజలతో నిత్యం రద్దీగా కళకళలాడే ఉండి సెంటర్ ఇప్పుడు నిర్జీవంగా మారిపోయింది. అధికారులు, కూటమి నాయకులు చిరువ్యాపారులపై ఉక్కుపాదం మోపడంతో వారంతా నడిరోడ్డున పడ్డారు. ఆక్రమణల పేరుతో రోడ్లపై చిరు వ్యాపారులను ఖాళీ చేయించి వారి జీవితాలతో ఆడుకున్నారు. గతంలో ఓసారి ఉండి సెంటర్‌లో కొంతమేర, గణపవరం రోడ్డులో అనుకున్నంతగా తొలగించిన అధికారులు ఇప్పుడు మాత్రం పూర్తిగా ఉండి సెంటర్ రూపురేఖలు మార్చేశారు. ఏళ్ల తరబడి ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపించి ఆక్రమణలు తొలగిస్తే బాగుండేదని, ఇప్పుడు మా పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. అంతేగాకుండా ఉండి బస్టాండ్‌లో మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో జంక్షన్ అయిన ఉండి సెంటర్‌లో ఆటోలు, బస్సుల్లోను ప్రయాణించేందకు పదుల సంఖ్యలో ప్రయాణికులు ఎదురు చూస్తుంటారు. ఇప్పుడు ప్రయాణికులకు నిలువనీడ లేక సమీపంలో ఉండే ఇళ్లవద్ద నిలబడి ఆటోలు, బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్న దృశ్యం

భీమవరం: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాజీ కౌన్సిలర్లు ఎంఏ నౌషాద్, మాగాపు ప్రసాద్ కోరారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్‌ఎం షేక్ బాబాజీ సాహెబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోడల్ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్, దుస్తులు వంటివి అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, మహమ్మద్ కాజా, యర్రంశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



పెదఅమీరంలో మైక్రో వాటర్ ప్లాంట్ ప్రారంభించి నీరు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

కాళ్ల: నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమీరంలో రూ.15లక్షల నిధులతో నిర్మించిన 10 లక్షల లీటర్ల కెపాసిటీ గల మైక్రోఫిల్టర్‌ను కలెక్టర్ సి.నాగరాణి, కెనరా బ్యాంక్ ఎండీ కలిదిండి సత్యనారాయణరాజుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకు వారు నియోజకవర్గంలో 25 మైక్రో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. అనంతరం గ్రామ పరిధిలో భీమవరానికి సమీపంలో ఎన్టీఆర్ పేరుమీద నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు కలెక్టర్ నాగరాణితో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, డీసీ చైర్మన్ గోకరాజు వెంకటశివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంలో అభివృద్ధికి ప్రాధాన్యత



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో జిల్లాలో రహదారుల నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు భారీగా నిధులు సాధించినట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. సోమవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోసరి– భీమవరం– పిప్పర రహదారి అభివృద్ధికి రూ.100 కోట్లు నిధుల మంజూరు, ఎన్‌హెచ్ 165 ఫేజ్ 2 ఆకివీడు– దిగమర్రు రహదారి నిర్మాణ సమస్యను పరిష్కరించి నాలుగు లైన్ల రోడ్డుకు అనుమతులు సాధించామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు రూ.10 కోట్లు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించినట్లు శ్రీనివాసవర్మ చెప్పారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు తప్పనిసరి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రంగమ నాయుడు

పాలకోడేరు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు మండల ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్ రంగంనాయుడు అన్నారు. ప్రతి నెలా 9న నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సుమారు 50 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు ముఖ్యంగా ఆకుకూరలు, పీచు, ఐరన్ శాతం ఎక్కువగా ఉండే కాయగూరలు, పండ్లు తీసుకోవడమే కాకుండా శరీరానికి తగిన వ్యాయామం కూడా చేస్తే సాధారణ ప్రసవం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యునైజేషన్ అధికారి డాక్టర్ డి.సుధాలక్ష్మి, డీపీహెచ్ఎన్ఓ జి.వెంకటరత్నం, వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, పీహెచ్ఎన్ కుమారి, సీహెచ్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- గ్రామాల్లో సికిల్ సెల్ వ్యాధిపై సర్వే
- వ్యాధిపై అవగాహన తప్పనిసరి
- 19న ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే



దగ్గులూరులో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నవ్య జీవన్, వైద్య సిబ్బంది(ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: ప్రతి మనిషి అంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఏ అనారోగ్య సమస్యకైనా దాదాపుగా రక్తహీనతే కారణమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. మన కళ్ల ముందు చిన్నారులు ఆడుతూ పాడుతూ చలాకీగా తిరుగుతూ ఒక్కసారిగా నీరసపడిపోయారంటే ఆ తల్లి తల్లడిల్లిపోతుంది. దీనికి ప్రధాన కారణం చిన్నారుల్లో సాధారణంగా కనిపించే రక్తహీనతే. ఇది సమస్యగా మారి సికిల్ సెల్ వ్యాధికి కారణమవుతుంది. సికిల్ సెల్ ఎనీమియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు

రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది. కళ్లు పసుపు రంగులోకి మారతాయి, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. అలసట వస్తుంది. అంటు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. వీపు, కాళ్లు, ఛాతి భాగాల్లో విపరీతమైన నొప్పి వస్తుంటుంది. విరేచనాలు, జ్వరం, డీహైడ్రేషన్, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు నొప్పులను మరింత తీవ్రం చేస్తాయి.

పాఠశాల దశ నుంచే సర్వే

సికిల్ వ్యాధి నిర్మూలన రక్తహీనత నివారణతోనే సాధ్యమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై ప్రపంచ ఆరోగ్య కేంద్రాల ఆదేశాల మేరకు పాఠశాల దశ నుంచే రక్తహీనత నివారణకు వైద్య ఆరోగ్య శాఖ దేశ వ్యాప్తంగా ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్య వివరాలు సేకరించడం వారికి తగిన చికిత్స అందించడం చాలా ముఖ్యమని గుర్తించారు.

వ్యాధి నియంత్రణకు కృషి

సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో ఈ సికిల్ సెల్ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుంది. గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి ఈ వ్యాధి సోకుతున్నట్లు గుర్తించారు. వివాహం చేసే ముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు వీలుంటుంది. జన్యువు కలిగి ఉన్న క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ

2047 నాటికి దేశంలో సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తుంది. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, నిర్ధారణకు పరీక్షలు నిర్వహించడం, వ్యాధి సోకిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న సికిల్ సెల్ అవేర్‌నెస్ డేను పాటించాలని కేంద్రం ప్రభుత్వం సమాయత్తం అవుతుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్యఅగ్రహారం, కోడవల్లి రోడ్, దుర్గా కర్రీ పాయింట్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండిలో...

ఉండి: ఉండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు కొమ్మల తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్ వెంటేశ్వరరావు తెలిపారు. ఎన్నార్పీ అగ్రహారంలోని బీసీ కాలనీ, ఉండి భీమవరం రోడ్డులోని హైవేపై, మహదేవపట్నం ఏరియాలోని ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

కళావేదిక నిర్మాణానికి భూమి పూజ

ఆకివీడు: కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.100 కోట్లతో దేశంలో ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు వెల్లడించారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నందమూరి తారకరామ కళావేదిక నిర్మాణానికి ఆయన ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణితో కలిసి భూమి పూజ చేశారు. కళావేదిక నిర్మాణానికి, పార్కు ప్రాంగణ అభివద్ధికి రూ.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

భీమవరం: నిబంధనలు పాటించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ లక్ష్మణ్, బి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫామ్ వంటివి విక్రయిన్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు చెల్లించాలి



వడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

పెనుగొండ: రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వడలిలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని పరిశీలించి, ఉపాధి కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రెక్కాడితే గాని, డొక్కాడని వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటే వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు మండుతుండడంతో కార్మికులకు తాత్కాలిక నీడను, తాగునీటి సౌకర్యం కల్పించడంలోనూ, ఉపాధి కూలీలకు పనులు చూపడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాడు రమణ, పార్వతి, సర్వేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: పంచాయతీల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నడిపూడి పంచాయతీ కార్యదర్శికి వేతనాలు సకాలంలో చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు కార్మికులకు వేతనాలు చెల్లించడానికి ఒకరిపై ఒకరు ఆరోపిస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇద్దరు సమన్వయంతో పని చేసి వేతనాలు సత్వరం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో పోరాట చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.